# ఏమో

శీను, ఉదయం లేచీ లేవడంతోనే మళ్ళీ వచ్చాడు, ఏదో పాఠం చెప్పమని. అప్పటికి ఎనిమిది గంట లయింది. నేను "టీ" తాగి "What life has taught me" అనే పుస్తకం చదువుతున్నాను. ఇది ఒక వ్యాస సంకలనం. "Bertrand Russel" వంటి విశ్వవిఖ్యాతి పొందిన మేధావులు ఇందులో వ్యాసాల్ని వ్రాశారు.

"నేను" రెండుగా చీలాను.

ఒక "నేను" పుస్తకం చదువుతున్నది.

ఇంకొక "నేను" - నలభై సంవత్సరాల జీవితం నీకు ఏమి నేర్పింది" అని నన్ను నిలువదీసి ప్రశ్నిస్తున్నది.

మెదడు, "సరి అయిన సమాధానంకోసం" ఒకటే పనిగా ఆలోచిస్తున్నది.

కళ్లు పంక్తుల తరబడి పుస్తకాన్ని చదువుకు పోతున్నాయి.

"నలభై సంవత్సరాల జీవితం ఏమి నేర్పింది?" ఆకాశం మెత్తున ఈ ప్రశ్న నా కళ్ళముందు నిలిచింది.

కళ్ళు జిగేలు మన్నాయి.....మెదడు పనిచేయడం మానుకుంది. సమాధానం దొరకని ప్రశ్న, ప్రశ్నగానే నిలిచి పోయింది.

"పాఠం చెప్పు నాన్నా" అని శీను ప్రశ్నని రెట్టించాడు.

"ఇప్పుడు వీలులేదు, సాయంత్రం చూతాం లెమ్మ" న్నాను నేను, అప్పటి మట్టుకు ఏదో విధంగా తప్పించుకుందామనే ఉద్దేశంతో.

"కాదు నాన్నా, మధ్యాహ్నం టెస్టు (నెల పరీక్ష) ఉంది. ఇప్పుడే చెప్పు" అన్నాడు శీను నిశ్చలంగా.

పాఠం చెప్పమంటే క్రితం రాత్రి Readers' Digest లోని "సమయం ఎల్లా సద్వినియోగం చేసుకోవాలి" అనే ఆర్నాల్డ్ బెనెట్ సంక్షిప్త గ్రంథం చదువుతో తప్పించు కున్నాను.

ఇక పాఠం చెప్పక తప్పింది కాదు.

"సరే, నీ పుస్తకం తెమ్మ"న్నాను, నేనుగత్యంతరంలేక.

శీను ఏడవ తరగతి చదువుతున్నాడు. వయస్సు పది సంవత్సరాలు.

ఏడవ తరగతి. "భూగోళ శాస్త్రము" శీను నా చేతిలో పెట్టాడు. మొదటి భాగంలోని "అక్షాంశాలు-రేఖాంశాల"కి సంబంధించిన పాఠంచెప్పమన్నాడు.

అది పుస్తకంలోని రెండవ పాఠం. మొదటి పాఠం నేను చదవలేదు. రెండవ పాఠం చదవడం మొదలు పెట్టాను. నేను మొదట అర్థం చేసుకొంటూ, శీనుకు చెప్పడం ఆరంభించాను.

"భూమిపై గీయబడిన ఊహారేఖల్ని అక్షాంశాలంటా"రని చెప్పాను. "ఉత్తర ధ్రువచక్రం, కర్కట రేఖ, భూమధ్య రేఖ, దక్షిణ ధ్రువచక్రం" మొదలైన ఊహారేఖల్ని గూర్చి వివరంగా చెప్పాను.

భూగోళం గీసి, దానిపైన రేఖల్ని సూచించాను. అంతవరకు పాఠం సవ్యంగా నడిచింది.

ఆ తరువాత జూన్ 21 వ తేదీన 30 డిగ్రీల దక్షిణాంశంపై సూర్యుని ఉన్నతాంశం తెలుసుకోవాల్సి వచ్చింది.

ఎంత ఆలోచించినా ఆ లెఖ్ఖ ఎట్లా చెయ్యాలో నాకు అర్థం కాలేదు. వెనకటి పేజీలు తిరగవేశాను. ప్రశ్న ఒకటికి రెండుసార్లు చదివాను. అయినా, ఆ లెఖ్ఖ ఎట్లా చెయ్యాలో తోచలేదు.

కాగితం, పెన్సిల్ తీసుకున్నాను. లెఖ్ఖ చెయ్యడం మొదలు పెడితే అదే వస్తుందన్న ధీమాకొద్దీ —

కాగితం నలుపు అవుతుందే కాని, లెఖ్ఖ రాదు.

శీను ముందు నాఓటమిని ఒప్పుకోవడం నాకుఇష్టంలేదు.

తిరిగి ఆలోచించాను.

ఫలితం మాత్రం శూన్యంగా కనపడింది.

నేను గీసిన గోళం పైన ఉత్తర ధ్రువ చక్రం, కర్కాట రేఖ, భూమధ్య రేఖ, దక్షిణ ధ్రువచక్రం – సమాంతరాలుగా ఉండక, ఒకదానితో ఇంకొకటి కలిసిపోతున్నాయి. క్రమంగా అల్లుకుపోతున్నాయి. ఉత్తర దక్షిణ ధ్రువాలు ఒకే కేంద్రంలో కుదించుకు పోతున్నాయి...బుర్ర గిర్రున తిరుగుతున్నది.

ఇంక లాభం లేదని తోచింది.

"మళ్లీ మొదటినుంచీ పాఠం ఇంకొకసారి చదువుకో, నీవే లెఖ్ఖ చేయగలుగుతా" వని శీనుని బుకాయించి పంపించి వేశాను.

శీను గదిలోంచి వెళ్లిపోవడంతోనే, బుర్ర తిరగడం మానుకుంది. వెంటనే "నలభై సంవత్సరాల జీవితం ఏమి నేర్పింద"ని హృదయం మెదడుని ప్రశ్నించింది.

మెదడు అలసి ఏమీ సమాధానం చెప్పలేదు.

"అబద్ధాలు చెప్పడం, తప్పించుకు తిరగడం నేర్పింది కదూ?" అని హృదయం చీత్కారం చేసింది.

"ఆ లెక్క నాకు రాలేదు. మరి ఏమి చేయమంటావు?" అని బుర్ర మూల్గింది.

"అయితే, 'నాకు రాద'ని చెప్పలేక పోయావా?" అని హృదయం యెదురు ప్రశ్న వేసింది.

"దాదాపు అదే అర్థం వచ్చేటట్లు సమాధానం చెప్పానే" అని బుర్ర వినీ వినపడకుండా మూల్గింది.

"శీను పది సంవత్సరాల కుర్రాడు. నీ దాదాపు సమాధానాలు వాడికి అర్థం కావు" అని హృదయం గట్టిగా అరిచింది.

"మరి ఇప్పుడు ఏమి చేయమంటావు?" అని బుర్ర బలహీనంగా మూల్గింది.

"ఏమీ లేదు. నలభై సంవత్సరాల జీవితం నీకు అబద్ధాలు చెప్పడం, తప్పించుకు తిరగడం నేర్పిందని ఒప్పుకో." హృదయం విజయగర్వంతో బల్ల గుద్దింది.

"అబద్ధాలు చెప్పడం, తప్పించుకు తిరగడం ఇదే నా నలభై సంవత్సరాల జీవితం నేర్పిన గుణపాఠాలు?" అని బుర్ర ఆలోచనా రహితంగా, పదేపదే గొణుక్కోవడం మొదలు పెట్టింది.

"ఏమో, ఎవరికి తెలుసు!" అని మా ఆవిడ ఏదో సందర్భంలో అంటున్నది. ఆ మాటలు నాకు ఇంట్లోనుంచి అస్పష్టంగా వినపడ్డాయి.

★